క్లుప్తంగా

అంబేద్కర్ జయంతి విజయవంతం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే జోగురామన్న కోరారు. కైలాస్‌నగర్‌లోని బుద్దవిహార్‌లో ఈనెల 30న నిర్వహించనున్న వేడుకలకు సంబంధించి పోస్టర్‌ను జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, అంబేద్కర్ ఉత్సవ కమిటీ చైర్మన్ దుర్గం శేఖర్, దాదాసాహెబ్, శైలేందర్, శాలిక్‌రావు, శోభ, అనిత, సులోచన, గంగారాం పాల్గొన్నారు.

పోస్టుకార్డులతో నిరసన



నిరసన తెలుపుతున్న కార్యదర్శులు

నార్నూర్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్యదర్శుల సమ్మెలో భాగంగా గాదిగూడ ఎంపీడీవో కార్యాలయం ఎదుట పోస్ట్ కార్డులతో మంగళవారం నిరసన తెలిపారు. సునీల్, విజయ్, సుభాష్, వెంకట్‌సాయి, ప్రశాంత్, రవి, మాణిక్‌రావు, అనంత్, రంజిత్, యోగరాజ్, రాహుల్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

28న జేఎల్, డీఎల్ పరీక్షపై అవగాహన

ఆదిలాబాద్‌టౌన్: జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్ పరీక్షలపై ఈనెల 28న ఆదిలాబాద్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జగ్‌రాం, కెరీర్ గైడెన్స్ సెల్ కోఆర్డినేటర్ నర్సింగ్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'రూ.కోట్ల ప్రజాధనం నీళ్లపాలు'



చెక్‌డ్యాంను పరిశీలిస్తున్న సుహాసినిరెడ్డి

జైనథ్: మండలంలోని కంత గ్రామ సమీపంలో సాత్నాల వాగుపై రూ.2.2 కోట్ల వ్యయంతో నిర్మించిన చెక్‌డ్యాం వృథాగా మారిందని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్, బీజేపీ నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి అన్నారు. మంగళవారం ఆమె స్థానిక నాయకులతో కలిసి కంత గ్రామంలో పర్యటించారు. అనంతరం చెక్‌డ్యాం వద్దకు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులు నాసికరంగా చేపట్టడంతో చెక్‌డ్యాం కూలిపోయి, నిరుపయోగంగా మారిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న నిర్లక్ష్యమే కారణమన్నారు. అధికారులు ఇకనైన స్పందించి చెక్‌డ్యాంకు మరమ్మతు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. నాయకులు సురేందర్, శివయ్య, క్రాంతికుమార్, వెంకట్‌రెడ్డి, సతీశ్‌రెడ్డి, అశ్విన్, మల్లికార్జున్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

'ప్రశ్నిస్తే అక్రమ కేసులు'



మాట్లాడుతున్న కంది శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్: పట్టణ ప్రజల కోసం ప్రశ్నిస్తే తనపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని బీజేపీ నాయకుడు కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కైలాస్‌నగర్ కాలనీలో గల ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే జోగు రామన్న ఆయన కుమారులకు సంబంధించిన అవినీతి గురించి ప్రశ్నిస్తే తన కుటుంబ సభ్యులపై కక్షగడుతున్నారన్నారు. ఎమ్మెల్యే జోగు రామన్న నియోజకవర్గ అభివృద్ధికి చేసింది ఏమీ లేదన్నారు. ఎమ్మెల్యే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు, శంకర్, సంతోష్ రావు, సునంద రెడ్డి, పరమేశ్వర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు ప్రారంభం

బజార్‌హత్నూర్: మండలంలోని కొలారి గ్రామంలో మంగళవారం కంటివెలుగు కార్యక్రమాన్ని ఎంపీఈవో చౌహాన్ రాధ ప్రారంభించారు. మెడికల్ ఆఫీసర్ భీంరావ్, సర్పంచ్ గంగనారాయణ, రమేష్ పాల్గొన్నారు.

వడగళ్ల వర్షం

● రోడ్లు జలమయం ● దెబ్బతిన్న పంటలు ● తెగిపడిన విద్యుత్ తీగలు



బోథ్: మొక్కజొన్నపై కప్పిన టార్పాలిన్లు



బజార్‌హత్నూర్: నేలకొరిగిన విద్యుత్ స్తంభం



నేలకొరిగిన గిరిగాం గ్రామ ముఖ ద్వారం



తాంసి: జామిడి శివారులో నేలవాలిన జొన్న



ఇచ్చోడ: మండల కేంద్రంలో కురిసిన వడగళ్లు



ఇంద్రవెల్లి: వాల్గొండలో..



తలమడుగు: పొంగిపొర్లుతున్న డోర్లి వాగు



తాంసి పాఠశాల ఆవరణలో నిలిచిన వరదనీరు



తాంసి నుంచి కప్పర్ల వెళ్లేరోడ్డుపై నిలిచిన వరదనీరు

తాంసి: జిల్లాలో మంగళవారం వడగళ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. ఏకధాటిగా కురిసిన వానలకు రోడ్లు, వీధులన్నీ జలమయం అయ్యాయి. వాగులు పొంగిపొర్లాయి. చేన్లు నీళ్లపాలు కాగా, పంటలు నేలకొరగడంతో రైతులకు నష్టం వాటిల్లింది. ఈదురుగాలులకు చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. తాంసి, భీంపూర్ మండలాల్లో వడగళ్ల వానతో చేలలో పని చేస్తున్న రైతులు, కూలీలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జొన్న, నువ్వు, పెసరి పంటలు దెబ్బతిన్నాయి. గిరిగాం గ్రామ ముఖద్వారం వద్ద స్వాగతం బోర్డు నెలకొరిగింది.

ఉట్నూర్‌రూరల్: మండలంతోపాటు గ్రామాల్లో వడగళ్ల వానతో చెట్లు నేలకొరిగి, విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. ఇళ్లపై రేకులు లేచిపోయాయి. 3 గంటల వరకు కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

తలమడుగు: నందిగామ, లచ్చంపూర్, పల్లి(కె), నందిగామ, బరంపూర్, తలమడుగు, కుచులాపూర్‌లో వడగళ్ల వాన కురిసింది. ఎండిపోయిన వాగులు, కాలువలు నీటితో నిండి ప్రవహించాయి. కుచులపూర్, డోర్లి, తలమడుగు వాగులు పొంగిపొర్లాయి. ఈదురుగాలులతో చెట్లు, విద్యుత్ తీగలు తెగిపోయాయి. అదేవిధంగా జొన్న, నువ్వులు, వేరుశనగ దెబ్బతిన్నాయి.

బోథ్: మండల వ్యాప్తంగా వర్షం కురిసింది. కొన్నిచోట్ల పంటల్లో వర్షపు నీరు చేరింది. పలువురు మొక్కజొన్న పంటపై టార్పాలిన్లు కప్పారు.

ఇంద్రవెల్లి: పిట్టబొంగరం పంచాయతీ పరిధిలోని పాటగూడకు చెందిన ఆవు పిడుగుపాటుకు మృతి చెందింది. వాల్గొండలో విద్యుత్ తీగలపై చెట్లు పడిపోవడంతో స్తంభాలు నేలకొరిగాయి. ట్రాన్స్‌ఫార్మర్ కిందపడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అకాల వర్షంతో చేతికొచ్చిన మొక్కజొన్న, జొన్న పంటలకు నష్టం వాటిల్లింది.

బజార్‌హత్నూర్: కొలాంగూడలో ఒక స్తంభం, ఉమార్డ(జీ) వద్ద మూడు విద్యుత్ స్తంభాలు వర్షాలకు నేలకొరిగాయి. కొలాంగూడ, డేడ్ర, మాన్కపూర్, గిరిజాయి, ఉమార్డ(బి), ఉమార్డ(జీ), ఇంద్రనగర్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గోకొండ వద్ద భగీరథకు సంబంధించిన స్తంభం నేలకొరగడంతో బుధవారం మోర్కండి, ఏసాపూర్, బుర్కపల్లి, గోకొండ గ్రామాలకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. అకాల వర్షంతో వర్తమన్నూర్‌లో మొక్కొజొన్న, రబీజొన్న పంటలు దెబ్బతిన్నాయి.

ఇచ్చోడ: మండలంలో అరగంటపాటు వడగళ్ల వర్షం కురిసింది. బాదిగూడలో ఈదురుగాలులకు పంద్రం జంగు ఇంటి పై ఉన్న రేకులు లేచిపోయాయి. ఇంట్లో సరుకులు తడిసిపోయింది.

నేరడిగొండ: గ్రామాల్లో వర్షం కురవడంతో యాసంగి పంటలకు కొంత నష్టం వాటిల్లింది.

బీఆర్ఎస్ జెండాలు ఎగురవేత



మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న జోగు ప్రేమేందర్



ఇంద్రవెల్లి: బీఆర్ఎస్ జెండా ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



నేరడిగొండ: జెండా ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ, నాయకులు

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ఇంటింటికీ వివరించేందుకే ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక శాంతినగర్‌లో ఆయన పార్టీ జెండాను ఎగురవేశారు. పార్టీ శ్రేణుల జై తెలంగాణ నినాదాల నడుమ జెండాను ఆవిష్కరించి, పార్టీ ప్రస్థానాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటే విపక్షాలు అనవసర ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు.

నేరడిగొండ: మండల కేంద్రంలో పార్టీ జెండాను జెడ్పీటీసీ అనిల్ జాదవ్ ఆవిష్కరించారు. తెలంగాణలో ముఖ్యమంత్రి ఉద్యమ నాయకుడైన కేసీఆర్ నాయకత్వంలో అనేక విజయాలు సాధించామన్నారు. ఎంపీపీ రాథోడ్ సజన్, పార్టీ మండల కన్వీనర్ శివారెడ్డి, స్థానిక సర్పంచ్ పెంట వెంకటరమణ, మండల ఉపాధ్యక్షుడు మహేందర్ రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ ఆడెల్లు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి మనమందరం కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. మండలకేంద్రంలోని డోంగ్రె కాంప్లెక్స్ వద్ద పార్టీ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఖానాపూర్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ ప్లీనరీ సభకు తరలివెళ్లారు. జెడ్పీకోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, సర్పంచులు కోరెంగా గాంధారి, జాధవ్ లక్కన్, రాథోడ్ రాంచందర్, ఎంపీటీసీ సభ్యులు స్వర్ణలత, గిత్తే ఆశాబాయి, నాయకులు దేవ్‌పూజే మారుతి, కదం మహేష్, శ్యామ్ ఉన్నారు.

బోథ్: మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో గ్రామ అధ్యక్షులు పార్టీ జెండాను ఎగురవేశారు. సొనాల గ్రామంలో ఎంపీపీ తుల శ్రీనివాస్ పార్టీ జెండాను ఎగురవేశారు. సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద మండల కన్వీనర్ కృష్ణారెడ్డి జెండాను ఆవిష్కరించారు.

తలమడుగు: మండలంలోని కజ్జర్ల, సుంకిడి, తలమడుగు, దేవాపూర్, బరంపూర్, రుయ్యాడి గ్రామాల్లో పార్టీ జెండాలను గ్రామ అధ్యక్షులు ఆవిష్కరించారు. బోథ్ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్, వెంకటేష్, జీవన్‌రెడ్డి, దేవరెడ్డి, అబ్దులా, అనంద్, ప్రకాశ్, దేవ్‌రావు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: మండలంలోని బార్‌హత్నూర్, పిప్రి, వర్తమన్నూర్, గిర్నూర్, దేగామ, గులాబ్‌తాండ, జాతర్ల, గోకొండ, భూతాయి, చందునాయక్ తాండ గ్రామాల్లో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు. కానిందే రాజారాం, పరచ సాయన్న, జగదీశ్, పోతన్న, కుర్మే లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో సర్పంచులు, నాయకులు బీఆర్ఎస్ పార్టీ జెండాను ఎగురవేశారు. ఎంపీపీ జైవంత్‌రావు, సర్పంచులు, నాయకులు ప్రభాకార్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీవోఏల సమ్మె



మద్దతు తెలుపుతున్న బీఎస్పీ జిల్లా ప్రదాన కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్

తలమడుగు/బోథ్/నేరడిగొండ: జిల్లాలో ఐకేపీ వీవోఏల సమ్మె కొనసాగుతోంది. తలమడుగులో వీవోఏలకు సమ్మెకు బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి కత్తెర్ల లక్ష్మణ్ యాదవ్ మద్దతు తెలిపారు. బోథ్, నేరడిగొండలో బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్, బోథ్‌లో కాంగ్రెస్ నాయకులు, ఎల్‌డీఎం బోథ్ సమన్వయకర్త పసుల చంటి వీవోఏల సమ్మెకు మద్దతు ప్రకటించారు.

నిరుద్యోగ నిరసన ర్యాలీని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న గంగాధర్

ఉట్నూర్‌రూరల్: ఆదిలాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే నిరుద్యోగ నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు గంగాధర్, బొజ్జు కోరారు. మంగళవారం ఆయన ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు జావిద్ అక్రమ్‌తో కలిసి మాట్లాడారు. ఖానాపూర్ నియోజకవర్గం నుంచి దాదాపు 6 వేల మంది కార్యకర్తలు హాజరవుతారని తెలిపారు. మండల అధ్యక్షుడు దూట రాజేశ్వర్, నాయకులు ఖయ్యూమ్, సలీం, నిసార్, దేవానందం, తులసీరాం, జగదీశ్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: నిరుద్యోగ నిరసన ర్యాలీకి నిరుద్యోగులు, యువకులు, కార్యకర్తలు తరలిరావాలని ఏఐసీసీ సభ్యుడు నరేశ్ జాదవ్ కోరారు. మంగళవారం మండలంలో కార్యకర్తలను, నిరుద్యోగులను కలిసి ర్యాలీపై చర్చించారు. మండల అధ్యక్షులు సామన్‌పల్లి శేఖర్, మాజీ ఎంపీటీసీ కానిందే ఉద్ధవ్, రవి, విఠల్, ద్యావంతు నర్సయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నూతన కార్యవర్గం

ఆదిలాబాద్‌రూరల్: విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సామన్‌పెల్లి నర్సింలు, ప్రధాన కార్యదర్శిగా మీసాల స్వామి, కోశాధికారి దశరథ్ ఎన్నికయ్యారు. వీరికి ఎన్నికల అధికారులు సుదర్శనచారి, రాధాకృష్ణ, కిషన్ నియామకపత్రాలు అందజేశారు.

గుండెపోటుతో ఒకరు మృతి

ఉట్నూర్‌రూరల్: మండలంలోని సాలెవాడ(బి) పంచాయతీ పరిధిలోని మోతీరాంగూడకు చెందిన మెస్రం సోనేరావు (40) మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఉదయం టీ తాగి బయట కూర్చుగా అంతలో ఛాతీ నొప్పి వస్తుందని కుటుంబ సభ్యులకు తెలిపాడు. వెంటనే ఆటో ద్వారా ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య సీతాదేవి, ముగ్గురు సంతానం ఉన్నారు.

జంగుబాయి ఆలయ నిర్మాణానికి భూమిపూజ

నార్నూర్: గాదిగూడ మండలం ఆర్మీయాన్ గ్రామంలో ఆదివాసీ గిరిజనుల ఆరాధ్యదైవం జంగుబాయి ఆలయ నిర్మాణానికి గ్రామ పటేల్ కొరెంగా సీతారాం, దేవారి కొరెంగా నాందేవ్ మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు సహకారంతో రూ.5లక్షలతో ఆలయ పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ జవాదే భారత్, మెస్రం చిన్ను ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

బోథ్: మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీవాసుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ మంగళవారం ప్రధాన రోడ్డుపై బైఠాయించారు. కాలనీవాసులతో కలిసి ధర్నా నిర్వహించారు. బీజేపీ మండల కన్వీనర్ సుభాష్ సూర్య, ప్రధాన కార్యదర్శి తుకారాం, వెంకటేశ్, శేఖర్, అశోక్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు ఉన్నారు.

ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు మిషన్ శిక్షణకేంద్రాన్ని అసిస్టెంట్ లేబర్ అధికారి గోవర్ధన్ మంగళవారం సందర్శించారు. 30 మంది శిక్షణ అభ్యర్థులను శిక్షణ సామగ్రిని అందజేశారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సిబ్బంది గంగన్న, సామాజిక కార్యకర్తల అంజత్ ఖాన్, శిక్షకురాలు నిక్కత్ ఫర్వీన్ పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షణ

ఇచ్చోడ: జన శిక్షణ సంస్థ ద్వారా పలు రంగాల్లో యువకులకు శిక్షణ ఇస్తున్నట్లు డైరెక్టర్ శ్యామల అన్నారు. మండల కేంద్రంలో టైలరింగ్ శిక్షణను ప్రారంభించారు. ప్రోగాం ఆధికారి చెన్నాల రాజన్న, శిక్షకురాలు స్వప్న పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సం, కల్యాణోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్, భక్తులు, గ్రామస్తులు పూజలో పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

ఇచ్చోడ: మండలంలోని అడేగామ(కె) నుంచి చెరువు వరకు నిర్మించే గ్రావెల్ రోడ్డు పనులను ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ దండె విఠల్ మంజూరు చేసిన రూ. 5 లక్షలతో ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇచ్చోడ ఉపసర్పంచ్ లోక శిరీష్‌రెడ్డి, అడేగామ(కె) మాజీ ఉపసర్పంచులు మల్లేశ్‌రెడ్డి, సతీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

డెయిరీ ప్రారంభం

బోథ్: మండల కేంద్రంలో కనుగుట్ట డెయిరీని ఎంపీపీ తుల శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ఉపసర్పంచ్ రమేశ్, ఇదవు మనోహర్, మహిపాల్, నిర్వాహకులు ఇదవు శ్రావణ కుమార్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు

బోథ్: సొనాలలో ఖబరస్తాన్ ప్రహరీ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఎంపీపీ తుల శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం భూమిపూజ నిర్వహించారు. త్వరలో పనులు ప్రారంభమవుతాయని అన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీని ముస్లిం సోదరులు సన్మానించారు. సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ప్రశాంత్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన అవసరం



ఇచ్చోడ: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



బోథ్: డ్రమ్ములో నీటిని పరిశీలిస్తున్న వైద్యుడు

ఇచ్చోడ: మలేరియా వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇచ్చోడ పీహెచ్‌సీ వైద్యాధికారి సాగర్ పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో వైద్య సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనాఫిలిస్ దోమ ద్వార మలేరియా జ్వరం వస్తుందన్నారు. దోమల వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారా మలేరియా, డెంగీ వ్యాధులు రాకుండా అడ్డుకట్ట వేయవచ్చునని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సునీత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండలంలోని ముత్నూర్‌లో మలేరియా వ్యాధి నిర్మూలనపై ర్యాలీ నిర్వహించి వైద్యుడు శ్రీకాంత్ అవగాహన కల్పించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామాలను, ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. సర్పంచ్ తుమ్రం బాగుబాయి, సీహెచ్‌వో గోకుల్, వైద్యసిబ్బంది జాదవ్ శ్రీనివాస్, గేడం బలిరాం తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: మండల కేంద్రంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాథోడ్ రాజు, సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ చేపట్టారు. కూలర్లు, పాత టైర్లు, డ్రమ్ముల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమాన్ని వాగ్దారి, వడూర్, తేజాపూర్, కుమారి, వాంకిడి, రాజుర, కొర్టికల్, తర్నం తదితర గ్రామాల్లో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు.

తాంసి: గ్రామాల్లో భీంపూర్ వైద్యాధికారి నిఖిల్ రాజు, సిబ్బందితో కలిసి ఇంటింటా తిరుగుతూ మలేరియాపై అవగాహన కల్పించారు. సిబ్బంది జ్ఞానేశ్వర్, విష్ణుకుమార్, ఆశ కార్యకర్తలు జానాబాయ్, సరస్వతి ఉన్నారు.

బోథ్: పట్టణంలో పలు కాలనీల్లో నీటిని వైద్యాధికారి నవీన్‌రెడ్డి పరిశీలించారు. ఏఎన్ఎం, విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కాగా పట్నాపూర్ పంచాయతీ సర్పంచ్ సుగుణ అధ్వర్యంలో మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రామస్తులకు పరిశుభ్రతపై వివరించారు.

సీపీఆర్‌పై అవగాహన

తాంసి: భీంపూర్ మండలంలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి సీపీఆర్ విధానంపై మంగళవారం వైద్య శాఖ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. జిల్లా అదనపు వైద్యాధికారి మనోహర్ వారికి అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో ఆకస్మాత్తుగా పడిపోయిన వ్యక్తికి సీపీఆర్ ద్వారా శ్వాస అందించవచ్చన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, వైద్యాధికారి నిఖిల్, వైద్యసిబ్బంది జ్ఞానేశ్వర్, గంగాధర్, ప్రవీణ, లూసి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న మనోహర్

క్షయ వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉండాలి



రక్తనమూనాలను సేకరిస్తున్న డీఎంహెచ్ఓ, వైద్య సిబ్బంది

ఆదిలాబాద్‌రూరల్: క్షయ వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. మంగళవారం మావల మండలం వాఘాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కొలాంగూడలో టీబీ లక్షణాలు ఉన్న 40 మంది నుంచి నమూనాలు సేకరించారు. వాటిని జిల్లా క్షయ నిర్మూలన కార్యాలయానికి పంపించారు. కాగా మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మలేరియా రహిత సమాజం కోసం ప్రతిఒక్కరు పాటుపడాలన్నారు. సర్పంచ్ మడావి మయూరి, జిల్లా టీబీ నియంత్రణ అధికారి డా.శ్రీకాంత్ మిట్టపెల్లివార్, అంకోలి మెడికల్ ఆఫీసర్ రాహుల్, సూపర్ వైజర్ లక్ష్మి, సిబ్బంది చెన్న మల్లయ్య, రవీందర్, నవీద్ పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్' జయప్రదం చేయండి

ఇచ్చోడ: హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుతోపాటు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌తో ఈనెల 29న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నెముల కిరణ్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీలందరికీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాలు అందించాలన్నారు. ప్రభుత్వంతో సంబంధం ఉన్న మార్కెట్‌యార్డు, సివిల్ సప్లై, బేవరేజ్, ఎఫ్‌సీఐ హమాలీలను నాలుగవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ప్రభుత్వం వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గంగన్న, కార్యదర్శి పవార్ జితేందర్, హమాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు దుబాక సుభాష్, ప్రధాన కార్యదర్శి సిరిసిల్ల భూమయ్య తదితరులు పాల్గొన్నారు.